

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 826.80 అడుగుల వద్ద ఉంది.



దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ వెంకటరమణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ డి. వెంకటరమణ బుధవారం దర్శించుకున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ. 4వేలు, గరిష్ట ధర రూ. 4,800లు, మోడల్ ధర రూ. 4,400లు వరకు పలికింది.

న్యూస్‌రీల్

నగరపాలక సంస్థ సీఎంఓహెచ్‌గా డాక్టర్ ఆషా



నెహ్రూనగర్ : గుంటూరు నగరపాలక సంస్థ నూతన సీఎంఓహెచ్‌గా ఏలూరు జిల్లా నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ డి.ఆషాని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో మెరుగైన పారిశుధ్యం అందించడంలో ప్రజారోగ్య విభాగం మరింత బాధ్యతగా పని చేసేలా కృషి చేయాలని సీఎంఓహెచ్‌కు కమిషనర్ కీర్తి సూచించారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

ఈనెల 22న పాఠశాలలు పునఃప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్రాంతి సెలవులను ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు ఈనెల 22న పాఠశాలలను పునః ప్రారంభించాలని పేర్కొన్నారు. సెలవుల్లో పదో తరగతి సహా విద్యార్థులెవ్వరికీ తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గుర్తింపు రద్దుతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పోస్టుల భర్తీకి ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, డ్రైవర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత అవసరం. డ్రైవర్ పోస్టులకు 2–3 సంవత్సరాల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో అనుభవజ్ఞులైన అభ్యర్థులు అవసరం. మరిన్ని వివరాలకు జిల్లా మేనేజర్ బాల చంద్రుడు మొబైల్ నంబర్ 90328 76888లో సంప్రదించాలన్నారు.

తైక్వాండోలో ముగ్గురికి స్వర్ణం



తెనాలిఅర్బన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన ఎ.జాహ్నవి, జి.వెంకట శ్రీమంత్, ఎ.చరణ్‌తేజ్‌లకు బంగారు పతకాలు లభించినట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ నెల 7న మంగళగిరిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే వీరిని రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జట్టుకు ఎంపిక చేసినట్లు వివరించారు. బుధవారం అకాడమీ ఆవరణలో వీరిని అభినందించి, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

గుంటూరు వెస్ట్: గుంటూరు కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న షేక్ ఇస్మాయిల్ విడవలూరు తహసీల్దార్‌గాను, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.వెంకటస్వామిని రాపూరుకు, రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న పి.జాన్‌పీటర్‌ను దగదర్తి తహసీల్దార్‌గా, గురజాల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.శివనాగిరెడ్డిని ఆత్మకూరు తహసీల్దార్‌గా, బాపట్లలో ఏఓగా పనిచేస్తున్న కె.గోపీకృష్ణను చీరాల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఎం.డి.ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

టెన్నిస్ పోటీలకు క్రీడాకారులు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో గురువారం నుంచి జరగనున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు బాల మనోజ్, చరణ్, షేక్ అబ్రాల్ ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల మనోజ్, చరణ్‌లు అండర్–19, షేక్ అబ్రాల్ అండర్–17 విభాగాల్లో పోటీ పడతారన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్టేడియం టెన్నిస్ సభ్యులతోపాటు రేమండ్స్ అధినేత టి.అరుణ్ కుమార్ అభినందించారన్నారు.

గ్రామాలకు నవశకం

పల్లెసీమల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా గ్రామ పంచాయతీలో క్షేత్ర స్థాయి అవసరాలతో పాటు తొమ్మిది థీమ్‌ల అమలుకు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు షెడ్యూల్ విడుదల చేశాయి. ఇప్పటికే జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ పూర్తి చేసింది. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ప్రక్రియను ప్రారంభించింది.

పంచాయతీల అభివృద్ధికి తొమ్మిది థీమ్‌లతో ప్రణాళిక



సత్తెనపల్లిలో శిక్షణ అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారుల బృందం

- ప్రతి ఏడాది ఒకటి లేదా రెండు థీమ్‌ల అమలుకు ప్రాధాన్యం
- ఇప్పటికే డ్రాఫ్ట్ జీపీడీపీ తయారీపై ఆర్పీలకు శిక్షణ పూర్తి
- జిల్లాలో ప్రారంభమైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ
- జాతీయ సదస్సుకు జిల్లా నుంచి బృందం ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో 28 మండలాల పరిధిలో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధుల వినియోగం, చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తుంటారు. జనరల్ ఫండ్స్‌లో 30 శాతం సిబ్బంది జీతభత్యాల కోసం, 15 శాతం తాగునీటి అవసరాలు, 15 శాతం పారిశుద్ధ్య నిర్వహణ, 15 శాతం వీధిదీపాల నిర్వహణ, 10 శాతం రహదారులు, డ్రెయిన్ల నిర్వహణ, 10 శాతం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఐదుశాతం నిధులు ఈ–గవర్నెన్స్ (కంప్యూటర్లు, ఇతర సాంకేతిక అవసరాల) కోసం వ్యయం చేయాల్సి ఉంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు టైడ్ గ్రాంట్ 50 శాతం పారిశుద్ధ్యం, 50 శాతం తాగునీటి అవసరాలకు వెచ్చించాలి. అన్ టైడ్ గ్రాంట్ స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

తొమ్మిది థీమ్‌ల ప్రాతిపదికగా..

పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహ పూర్వక గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామం... ఇలా తొమ్మిది అంశాల ప్రాతిపదికగా యాక్షన్ ప్లాన్ తయారీకి గత ఏడాది నుంచే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి పంచాయతీ వీటిలో కనిష్ఠంగా ఒకటి, గరిష్ఠంగా రెండు థీమ్‌లు ఎంచుకొని నిధుల కేటాయింపులో వీటి అమలుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ మేరకు గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ఏటా ఒక థీమ్‌ను ఎంచుకొని ప్రణాళిక ప్రకారం గ్రామాల అభివృద్ధి చేసుకోవాలన్నది వీటి ముఖ్య ఉద్దేశం. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఈనెల 25 నుంచి 27వ తేదీలోగా జీపీడీపీ (2024–25) ఆమోదానికి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వ హించాలి. 27 నుంచి 28వ తేదీ వరకు గ్రామస్థాయిలో ఆమోదించిన జీపీడీపీని మండల స్థాయి కమిటీ పరిశీలన చేస్తుంది. అనంతరం 28, 29 తేదీల్లో గ్రామ పంచాయతీ తీర్మానం ఆమోదం, ఇలా ఆమోదించిన ప్రణాళికలను ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో ఈనెల 31లోగా అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి ఒకటి నుంచి 29వ తేదీలోగా మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) తయారు చేయాల్సి ఉంది. అలాగే జిల్లా పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికను కూడా ఆమోదించాల్సి ఉంటుంది.

జిల్లాలో శిక్షణ ప్రారంభం..

మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా శిక్షణ ప్రారంభమైంది. పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక డ్రాఫ్ట్ (జీపీడీపీ) తయారీపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మండలాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, ఈఓపీఆర్డీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, మండలం నుంచి ఒక కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్లకు ఈ నెల 9,10 తేదీల్లో రెండు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. వారంతా బుధవారం మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం కూడా జిల్లాలో కొనసాగనుంది.

జాతీయ సదస్సుకు జిల్లా నుంచి బృందం ..

ఆరోగ్యకరమైన గ్రామాలు అనే అంశంపై ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజులు పాటు తిరుపతిలో జరిగే జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా నుంచి ఎంపిక చేసిన 16 మంది బృందం బుధవారం రాత్రి బయలుదేరి వెళ్లనుంది.

పంచాయతీల సంపూర్ణ అభివృద్ధికి దోహదం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామ పంచాయతీలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు జీపీడీపీలను రూపొందించడం జరుగుతుంది. ఈ ప్రణాళిక మేరకు నిధులు కూడా విడుదలవుతాయి. జీపీడీపీ రూపకల్పనపై జిల్లాస్థాయిలో ఇప్పటికే ఎంపిక చేసిన అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. మండలస్థాయిలో కూడా శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణ గురువారంతో ముగుస్తుంది.

– ఎంవీ భాస్కరరెడ్డి,
డీపీఓ, పల్నాడు జిల్లా

ముగిసిన సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహణ



కళాకారులను సన్మానించిన జిల్లా కలెక్టర్ శివశంకర్, అధికారులు

నరసరావుపేట: సంక్రాంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో మూడురోజుల పాటు నిర్వహించిన పల్నాడు జిల్లా సంక్రాంతి సంబరాలు మంగళవారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. ఈసందర్భంగా టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్, ఫోక్ అండ్ రాక్ సింగర్ రఘు కుంచె ఆలపించిన ప్రత్యేక గీతాలు సంగీత ప్రియులను అలరించాయి. పాడుతా తీయగా యాంకర్ సుమంత్, సునంద బృందం ఆలపించిన గీతాలు సంగీత ప్రియులను అలరించాయి.

జబర్దస్త్ కామెడీ నటులు ఇమ్మానుయేల్, శాంతి స్వరూప్, గడ్డం నవీన్, చిత్రం శ్రీను ప్రత్యేక కార్యక్రమాలు అందరినీ మెప్పించాయి. చిన్నారులు ప్రదర్శించిన శివుని నృత్యం, డంబుల్స్ డాన్స్ ఆకట్టుకుంది. జిల్లాకు చెందిన వివరాలతో లేజర్‌షో అద్భుతం అన్పించింది. ప్రత్యేకంగా డ్యాన్స్ ప్రోగ్రాం అలరించింది, రష్యన్ క్విక్, చేంజ్ డాన్స్ ప్రోగ్రాం, చిన్నారుల డాన్సులు అలరించాయి. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కుటుంబ సమేతంగా హాజరై సీనియర్ సిటిజన్లు, క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఆర్‌ఓ కె.వినాయకం, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, జిల్లా అధికారులు ఆంజనేయులు, బీజే బెన్ని, కె.శామ్యూల్, తహసీల్దార్ ఆర్‌వీ రమణకుమార్, విద్యుత్ ఉద్యోగి ఆర్.బంగారయ్య, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

22న తుది ఓటరు జాబితా విడుదల

నరసరావుపేట: ఈనెల 22న చివరి ఓటరు జాబితా రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని డీఆర్‌ఓ కె.వినాయకం వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి డీఆర్‌ఓ వినాయకం హాజరయ్యారు. జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘానికి నియోజకవర్గాల వారీగా పంపించిన ఓటర్ల జాబితా వివరాలను వివరించారు. వాటి వివరాలు, ఎన్నికల ఓటరు జాబితాలను బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఓటర్ల వివరాలను తయారు చేసేందుకు రాజకీయ పార్టీలతో మూడు సమావేశాలు నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేశామన్నారు. సహకరించిన ప్రతి ఒక్క రాజకీయ పార్టీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్‌ఓ వినాయకం

జిల్లాలో 3.10 లక్షల క్లెయిములు పరిష్కారం

జిల్లాలో ఫారం–6,7,8లను 3,81,908 స్వీకరించగా వాటిలో 3,10,789 పరిష్కరించినట్లు డీఆర్‌ఓ వినాయకం వెల్లడించారు. మిగతా వాటిలో 58,518 దరఖాస్తులను తిరస్కరించగా మరో 12,601 పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లా మొత్తం 1926 పోలింగ్ స్టేషన్లు ఉండగా పట్టణాల్లో 422, గ్రామాల్లో 1504 ఉన్నాయన్నారు.

ఎక్కడివారికి అక్కడే..!



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

నాన్ జంబ్లింగ్ పద్ధతిలోనే ఇంటర్ ప్రాక్టికల్స్

- ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఒకేషనల్, 11 నుంచి సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ప్రారంభం
- గుంటూరు జిల్లాలో 24,330 మంది విద్యార్థులకు 118 కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఇంటర్ బోర్డు అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్మీడియెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గుంటూరు జిల్లావ్యాప్తంగా 163 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 24,330 మంది విద్యార్థులకు 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఇంటర్ వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానుండగా, సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్న విద్యార్థుల్లో ద్వితీయ సంవత్సర ఎంపీసీ, బైపీసీ విభాగాల నుంచి 22,288 మంది విద్యా ర్థులు ఉండగా, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం 1010, ద్వితీయ సంవత్సరం నుంచి 1032 మంది విద్యార్థులు ఉన్నారు.

- ఇంటర్మీడియెట్ బోర్డు ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలను పరిశీలించిన అధికారులు ఆయా కళాశాలల్లోని ప్రయోగశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణకు వీలుగా అవసరమైన పరికరాలు, రసాయనాలు అనువుగా ఉన్నవీ, లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పూర్తిస్థాయిలో వసతులు ఉన్న కళాశాలలనే ప్రాక్టికల్స్ నిర్వహణకు ఎంపిక చేసినట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ చెప్పారు. ప్రతి కళాశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి బోర్డు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉన్నవీ, లేనివీ పరిశీలించిన తరువాతే ప్రాక్టికల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

మైనార్టీల అభివృద్ధికి అండ

- సీఎం వైఎస్ జగన్ హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు జరిగింది
- నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన మహానేత వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్
- 55 నెలల్లో మైనార్టీల ఖాతాల్లో రూ.26వేల కోట్ల నగదు బదిలీ
- మంత్రి పదవులు, పార్టీ పదవులు, కార్పొరేషన్ల నియామకాలు, స్థానిక సంస్థల్లో పెద్దపీట
- ప్రతిపక్షాల దుష్ప్రచారాలు నమ్మొద్దు
- 'జగన్ పాలన – మైనార్టీల స్పందన'పై రాష్ట్రస్థాయి ప్రజా సదస్సులో వక్తలు వెల్లడి



నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ వీవీఆర్ కృష్ణంరాజు అన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు తాలుకా పెన్షనర్స్ హాల్‌లో బుధవారం 'జగన్ పాలన – మైనార్టీల స్పందన' పై రాష్ట్రస్థాయి ప్రజా సదస్సు జరిగింది. ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ పేద వర్గాల్లోని ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని చెప్పారు. మైనార్టీల తరపున ఒకరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం చాలా సంతోషకరమని అన్నారు. రెవ.నవకుమార్ మాట్లాడుతూ ఇంటి బయట సైకిల్, టేబుల్‌పై గ్లాస్ ఉండాలని, అయితే ఫ్యాన్ గాలి కింద ప్రజలు హాయిగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ గ్రంథాలయ చరిత్రలో ఎస్సీలను నియమించిన దాఖలల్లేవని అన్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లను నియమించడం శుభపరిణామమని చెప్పారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు ముస్లిం మైనార్టీలు వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. పొన్నూరు మసీదు ప్రచార కార్యదర్శి షేక్ అబ్దుల్‌నాజర్ మాట్లాడుతూ గతంలో హజ్ యాత్రకు వెళ్లాలంటే అనేక ప్రయాసలకు గురికావాలని, ప్రస్తుతం అనేక మౌలిక సౌలభ్యాలను కల్పించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిముల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మైనార్టీలకు కార్పొరేషన్ల కేటాయింపులో అగ్రతాంబూలం ఇచ్చారని అన్నారు. ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ హయాంలో అందరూ హాయిగా ఉన్నారని, కానీ ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. వారి ఉచ్చులో పడవద్దని, అసత్యాలను నమ్మవద్దని సూచించారు. న్యాయవాది షేక్ లియాఖత్ అలీ మాట్లాడుతూ మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ దిక్సూచీగా ఉన్నారని అన్నారు. నలుగురు మైనార్టీల ఎమ్మెల్యేలు ఉంటే అందులో ఒక ఉప ముఖ్యమంత్రి, మండలి వైస్ చైర్మన్‌గా మైనార్టీ మహిళను నియమించారని ఆయన గుర్తు చేశారు. 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్, విశ్రాంత తహసీల్దార్ విక్టర్‌పాల్, భాగ్యరావు, పి.సుందర రావు, సత్యనారాయణరెడ్డి, పలువురు వక్తలు హాజరై ప్రసంగించారు.

మైనార్టీలకు రూ.26వేల కోట్ల నగదు బదిలీ..



ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ 55 నెలల్లో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు సుమారు రూ.26 వేల కోట్ల నగదు బదిలీ జరిగిందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

పెత్తందార్లకు బుద్ధి చెప్పాలి..



బెటర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే దోచుకోవచ్చు, దాచుకోవచ్చుననే ఆలోచనతో కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అటువంటి పెత్తందార్లకు బుద్ధి చెప్పాలని అన్నారు. పేదలకు అన్నివిధాల అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మరోసారి తోడుగా నిలవాలని చెప్పారు. మైనార్టీలతోపాటు అన్నివర్గాల అభివృద్ధికై నిరంతరం శ్రమించే ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు.

పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య..



ఆచార్యులు శరత్ జ్యోత్స్నా రాణి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇంగ్లిష్ చదవాలనే ఒక ఆశ ఉండేదని అన్నారు. ఆ ఆశను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారని చెప్పారు. అందరి గురించి ఆలోచించే మానవత్వం ఉన్న మనిషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

ముస్లింలు సీఎం వైఎస్ జగన్ వెంటే..



జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం మహానేత వైఎస్సార్ ఒకడుగు వేస్తే సీఎం వైఎస్ జగన్ పది అడుగులేశారని చెప్పారు. ఏపీలో 2,198 మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదులోని మౌజన్, ఇమామ్‌లకు ఏటా రూ.1.98 లక్షలు గౌర వేతనం చెల్లిస్తున్నారని అన్నారు. ఈ 55 నెలల్లో కోట్ల రూపాయలను గౌరవ వేతనంగా అందించిన ఘనత వైఎస్ జగన్‌కే సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీలోని సుమారు రూ.2.20 కోట్ల ముస్లింలు వైఎస్ జగన్ వెంటే ఉన్నారని అన్నారు.

మహానేత వైఎస్సార్ బాటలో సీఎం జగన్..



అంజుమాన్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ మొయినుద్దీన్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్‌పై నమ్మకంతో 2004, 2009 ఎన్నికల్లో ఆయన్ను ముస్లింలు మళ్లీ గెలిపించారని చెప్పారు. అదేస్ఫూర్తితో వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచి, గెలిపించారని అన్నారు. 4 శాతం రిజర్వేషన్ల అమలుతో ఎందరో వైద్యులు, ఇంజినీర్లు మైనార్టీల ప్రతి ఇంట్లో ఉన్నారని, అందుకు మహానేత వైఎస్సారే కారణమని చెప్పారు. తండ్రి బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెళ్తున్నారని అన్నారు.

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

డీఎంహెచ్ఓ రవి



నరసరావుపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువ అయిందని డీఎంహెచ్ఓ డాక్టర్ రవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బుధవారం బాబాపేట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మూడో వార్డు ప్రజలకు స్థానిక సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు వేర్వేరుగా పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చెందిన ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు చక్రవర్తి, మెడికల్ సర్జన్ నజియా, పీహెచ్‌సీ వైద్యులు పర్వీను, డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి 308మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. వీరిలో మహిళలు 171మంది ఉండగా పురుషులు 136మంది, నలుగురు పిల్లలు, ఆరుగురు గర్భవతులతో పాటు 26 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఒకరికి కళ్లజోడు అందజేశారు. శిబిరాన్ని డాక్టర్ హర్షవర్ధనరెడ్డి పర్యవేక్షించారు.

డ్రైవర్లు మద్యంకు దూరంగా ఉండాలి

పీటీడీ జిల్లా అధికారి శ్రీనివాసరావు



నరసరావుపేట: బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్, మద్యానికి దూరంగా ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్ మాట్లాడుతూ డ్రైవర్లు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కంటి నిండా నిద్ర కూడా పోవాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బి.వీరాస్వామి అధ్యక్షత వహించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

- రిజర్వేషన్లతోనే దళితుల ఎదుగుదల
- బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించకపోతే దళిత సమాజం అగ్రకులాలతో సమానంగా ఎదిగేందుకు అవకాశం ఉండేది కాదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని దళిత సామాజిక వర్గాల ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి భారీగా దళితులు తరలి రావాలని పిలుపునిచ్చారు. మండల, గ్రామస్థాయి నాయకులు బాధ్యతగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సహకరించాలన్నారు.పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్ ముందుగా సమావేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, రాజుపాలెం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు, భవనం రాఘవరెడ్డి, వేపూరి. శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయ భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.దేవదాస్, వి.శరత్, మండల నాయకులు ఎస్.శ్యామ్‌సన్ మాట్లాడారు.

బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- నిందితుడి అరెస్ట్ కోరుతూ రాస్తారోకో
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు

పిడుగురాళ్లరూరల్: బాలికపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గ్రామంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో పదేళ్ల బాలిక చదువుతోంది. కొన్ని రోజులుగా బాలిక అనారోగ్యంతో బాధపడుతోంది. స్థానిక వైద్యశాలకు తీసుకెళ్లగా వైద్యులు బాలికపై లైంగిక దాడి జరిగి ఉండవచ్చుననే అనుమానంతో గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఘాతుకానికి పాల్పడి ఉంటాడని ఆరోపించారు. బాలికకు గుంటూరు జీజీ హెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దిశ డీఎస్పీ రవి చంద్ర తెలిపారు.

నిందితున్ని అరెస్ట్ చేయాలని డిమాండ్

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని బాలిక తల్లిదండ్రులు, బంధువులు అద్దంకి- నార్కెట్‌పల్లి హైవేపై బుధవారం రాస్తారోకో చేశారు. రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. రహదారికి ఇరువైపులా సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ పల్లపురాజు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, కేసు నమోదు చేసి, శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రాస్తారోకో విరమించారు.

జాతీయ సదస్సుకు ఫణిదం నుంచి ముగ్గురు ఎంపిక



బుల్లిబాబు



వీరాంజనేయులు

సత్తెనపల్లి: జాతీయ స్థాయిలో ఆరోగ్యకరమైన గ్రామాలు అనే అంశంపై ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు తిరుపతిలో జరిగే సదస్సుకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శి దాచేపల్లి వీరాంజనేయులు, సచివాలయ మహిళా పోలీస్ కట్టా రవిరాణి ఎంపికయ్యారు. ఈ మేరకు వారి ముగ్గురికి బుధవారం ఉత్తర్వులు అందాయి. జిల్లావ్యాప్తంగా 16 మంది ఎంపికయ్యారు. ఈ బృందం బుధవారం రాత్రి బయలుదేరి ఈ నెల 20 వరకు మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సులో పాల్గొననున్నారు. ఫణిదం నుంచి ఎంపికైన ముగ్గురిని సత్తెనపల్లి ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

కులగణనకు సహకరించండి

నరసరావుపేట: జిల్లాలో కులగణన ఈనెల 19 నుంచి 28వ తేదీవరకు పదిరోజుల పాటు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కులగణన చేస్తారన్నారు. ఈ సమాచారం గోప్యంగా ఉంటుందని, దీని వలన కుల నిర్ధారణ జరగదని, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, పథకాల అమలుకు ఎటువంటి ఆటంకాలు ఉండవని పారదర్శకంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆ సమయంలో అందుబాటులో లేనివారు ఈనెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సిబ్బందికి సహకరించి సమాచారం అందజేయాలని కలెక్టర్ కోరారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ దాడి



సత్తెనపల్లి వైద్యశాలలో గాయపడిన వ్యక్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి అంబటి

మాదల(ముప్పాళ్ల): పాత కక్షలు మనసులో పెట్టుకొని వివాదానికి అడ్డువచ్చిన వ్యక్తిపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని ఆటోపాయింట్ వద్ద వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు జవంగుల శ్రీనివాసరావు, అతడి కుమారుడు దుర్గామహేష్‌తో కలసి టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరావు సమీప బంధువు జవంగుల రవికిరణ్ ఇటీవలే వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరాడు. రవికిరణ్ టీడీపీకి చెందిన తన మిత్రులు దాసరి మహేష్, చౌడం వినయ్, మరికొంత మందితో కలసి దాసరి దత్తుబాబు ఇంటిపైకి వెళ్లి దౌర్జన్యం చేస్తుండటాన్ని గమనించిన దుర్గామహేష్ వారించే ప్రయత్నం చేశాడు. దీంతో దుర్గామహేష్‌పై ఒక్కసారిగా కర్రలు, ఇనుపరాడ్లతో దాడికి దిగారు. అడ్డువచ్చిన దుర్గామహేష్ భార్యను గాయపరిచారు. ఈ దాడిలో దుర్గామహేష్ తలకు తీవ్ర గాయం కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గతంలో జవంగుల శ్రీనివాసరావు, రవికిరణ్ కుటుంబాల మధ్య కుటుంబ వివాదాలు ఉన్నాయి. దుర్గామహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేర విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షతగాత్రులకు మంత్రి అంబటి పరామర్శ

ముప్పాళ్ల: టీడీపీ దాడిలో గాయపడి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం పరామర్శించారు. మండలంలోని మాదల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతి పరులైన జవంగుల దుర్గామహేష్ కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుర్గామహేష్‌ను పరామర్శించి దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కానాల పుల్లారెడ్డి, సైదా ఘటన తీరును మంత్రికి వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. భౌతిక దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



గాయపడిన దుర్గామహేష్

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు



అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు లిఖితపూర్వకంగా రాసి ఇస్తున్న కార్యకర్తలు

అమరావతి: అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం విధుల్లో చేరారు. 30 రోజులుగా సమ్మె చేస్తున్న కార్యకర్తలు కొందరు విధుల్లో చేరేందుకు అంగీకరిస్తూ లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. కార్యకర్తలు మాట్లాడుతూ తమ సమస్యలలో అత్యధిక భాగం ప్రభుత్వం పరిష్కరించిందని చెప్పారు. వేతనాలు వచ్చే జూలైలో పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో విధుల్లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ ఇమాంబీ మాట్లాడుతూ అమరావతి సెక్టార్‌లో 33 అంగన్‌వాడీ సెంటర్‌లు, ధరణికోట సెక్టార్‌లో 31 సెంటర్‌లు ఉండగా గతంలోనే ధరణికోట సెక్టార్‌లో ఉన్న 31 అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె విరమించి విధులలో చేరారన్నారు. బుధవారం అమరావతి సెక్టార్‌లోని 33 కేంద్రాలలో 22 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 15 మంది ఆయాలు లిఖితపూర్వకంగా తాము విధులలో చేరతామని రాసి ఇచ్చి విధులలో చేరారన్నారు. మరికొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులలో చేరటానికి తమను సంప్రదిస్తున్నారని వారు కూడా గురువారం విధుల్లో చేరతారని వెల్లడించారు.

అంగన్‌వాడీలు విధులకు హాజరుకావాలి

నరసరావుపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వెంటనే విధుల్లో చేరాలని జిల్లాలో మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అరుణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టులలో 2,031 మంది అంగన్‌వాడీలు పని చేస్తుండగా వీరిలో కార్యకర్తలు 1996, సహాయకులు 1925 మంది పనిచేస్తున్నారన్నారు. వీరందరూ గత నెల 12 నుంచి సమ్మెలో ఉండగా ప్రభుత్వం చేసిన సూచన మేరకు 1413 మంది విధుల్లోకి చేరారన్నారు. అంగన్‌వాడీ సహాయకులు కార్యకర్తలుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచిందని, టీఏ, డీఏలు పెంచిందని, పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు, సేవా ముగింపు ప్రయోజనం పెంచుతూ జీఓలు జారీ చేసిందని చెప్పారు. వీటిని గమనించి మిగతా కార్మికులు కూడా విధుల్లో చేరాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నేడు రక్తదాన శిబిరం

గుంటూరు మెడికల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్పం నినాదంతో ఈనెల 18వ తేదీ ఉదయం 9:00 గంటలకు గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగస్తులు, జిల్లాలోని ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు సమాజ శ్రేయస్సును కోరే యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో రక్త దానం చేయాలన్నారు.

22న కోటి ఒక్క లింగాల శివాలయం ప్రారంభం

పాత గుంటూరు: ఫిరంగిపురం మండలం వేమవరంలో ఈ నెల 22న కోటి ఒక్క లింగాల శివాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి జ్ఞానప్రసన్న గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఎనిమిది విస్తీర్ణంలో 101 అడుగుల మహా శివలింగంతోపాటు 50 అడుగుల మహానందీశ్వడు, కోటి ఒక్క లింగాలతో దేవాలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇందులో హుండీ, అభిషేకం టికెట్లు, వీఐపీ సౌకర్యాలు ఉండవని వెల్లడించారు.

తెనాలి సీటు 'ఆలపాటి'కే ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలిరూరల్: టీడీపీతో జనసేన పార్టీ పొత్తును తాము ఆహ్వానిస్తున్నామని, అయితే తెనాలి సీటు మాత్రం ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కే ఇవ్వాలని తెలుగు తమ్ముళ్లు డిమాండ్ చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తెనాలి సీటు జనసేన పార్టీకే ఇస్తున్నారని, పొత్తులో భాగంగా ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌కు తెనాలి సీటు ఖరారైందన్న వార్తల నేపథ్యంలో టీడీపీ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఇక్కడి నాజరుపేట ఎన్‌వీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ జనసేనతో పొత్తుకుంటే అన్ని సర్వేలు రాజాకే అనుకూలంగా ఉన్నాయని, తక్కువ ఓటింగ్ శాతం కలిగిన జనసేన అభ్యర్థికన్నా రాజాకు టికెట్ ఇవ్వడమే సముచితమన్నారు. పొత్తు ధర్మాన్ని కాదని జనసేన పార్టీ వాళ్లు కావాలనే దుష్ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ తమ పార్టీకి బలమున్న వేరే నియోజకవర్గాన్ని చూసుకోవాలన్నారు. టీడీపీ అధిష్టానం ఆలపాటికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, వంగా సాంబిరెడ్డి, మంగమూరి హరి, రావి చిన్ని నిమ్మకాయల రమ్య, జొన్నాదుల మహేష్, బొబ్బిళ్లపాటి ప్రసాద్‌బాబు, మాదల కోటేశ్వరరావు, మార్కండేయులు, కొండా రమాదేవి, తాడిబోయిన శ్రీనివాసరావు తదితరలు మాట్లాడారు. సమావేశం సందర్భంగా టీడీపీ కార్యకర్తలు షావుల్, వేణు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న నాయకులు అడ్డుకున్నారు.

తుమ్మలపాలెంలో అసిస్టెంట్ లైన్‌మెన్ హత్య

వివాహేతర సంబంధమే కారణం

ప్రత్తిపాడు: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ అసిస్టెంట్ లైన్ మెన్ దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని తుమ్మలపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్ మెన్ రూప్‌కుమార్ నాయక్ (35)కు అదే గ్రామానికి చెందిన వివాహితతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఏడుగంటల సమయంలో రూప్‌కుమార్ నాయక్ వివాహిత ఇంటికి వెళ్లగా అదే సమయంలో బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన వివాహిత భర్త అర్జునరావు తలుపులు వేసి ఉండటాన్ని గమనించాడు. దీంతో విచక్షణ కోల్పోయి తలుపులు గట్టిగా కొట్టడంతో కాస్సేపటికి తలుపు తీశారు. ఇదే సందర్భంలో అసిస్టెంట్ లైన్‌మెన్‌కు, అర్జునరావుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుని చివరికి ఒకరిపై ఒకరు మారణాయుధాలతో దాడి చేసుకున్నారు. అర్జునరావు నాయక్‌పై గొడ్డలితో దాడి చేయగా, నాయక్ కత్తిపీటతో దాడి చేశాడు. ఈ పెనుగులాటలో నాయక్ తలపై అర్జునరావు గొడ్డలి వేటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్ర బాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అర్జునరావు రక్తపు మడుగులో ఉండటంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కాగా అర్జునరావు భార్య పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

వికసిత్ భారత్-సంకల్ప యాత్ర జిల్లా పరిశీలకులు సాల్‌మన్ ఆరోఖ్యరాజ్



పురుగుల మందు పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొమ్మూరు(కాకుమాను): దేశంలోని ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలనే లక్ష్యంతోనే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పని చేస్తున్నారని సీనియర్ ఐఏఎస్ అధికారి, జాయింట్ సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ మినిస్టరీ ఆఫ్ ఫైనాన్స్ గవర్నమెంట్ అధికారి (వికసిత్ భారత్-సంకల్ప యాత్ర) జిల్లా పరిశీలకులు సాల్‌మన్ ఆరోఖ్యరాజ్ అన్నారు. మండలంలోని కొమ్మూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం వికసిత్ భారత్-సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 సంవత్సరం నాటికి దేశంలో ప్రతి గ్రామంలో ప్రజలకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఏటా అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, వివిధ కారణాల వల్ల ఆ పథకాలు అందని అర్హులు అధికారులను సంప్రదించి పొందాలని సూచించారు. కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దేశంలో ఏ ఒక్క ఇంటిలో కట్టెల పొయ్యి ఉండకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికీ అతి తక్కువ ధరకే గ్యాస్‌ను అందిస్తున్నామన్నారు.

తొలుత వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాస్త్ర సాంకేతికతని రైతులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన డ్రోన్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఈ మిషన్ల వలన ఎకరాకు 5-10 నిమిషాలలో పురుగు మందులను పిచికారీ చేయవచ్చునని వివరించారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ శ్రీఖర్ జైన్, డీఏఓ నున్న వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ మోహనరావు, గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతరం ఏసుక్రీస్తును నమ్మి పయనించాలి



మాట్లాడుతున్న బిషప్ పరదేశిబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరం ఏసుక్రీస్తు ప్రభువును నమ్మి జీవిత పయనాన్ని కొనసాగించాలని ఏఈఎల్‌సీ మోస్ట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు పేర్కొన్నారు. ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘ (ఏఈఎల్‌సీ) ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో బుధవారం యూత్ కన్వెన్షన్-2024 ముగింపు సభ జరిగింది. ఈసందర్భంగా పరదేశిబాబు మాట్లాడుతూ యూత్ కన్వెన్షన్‌లో రెండు వేల మంది ఒకేసారి పాల్గొనటం సంతోషకరమని, వీరందరూ దేవుని వైపు నడచి ఏసుక్రీస్తు ప్రభువు దీవెనలు పొందటం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం యూనివర్సిటీ-క్రిస్టియన్ ఐడెంటిటీ అనే అంశంపై బ్రదర్ సురేష్ వంగూరి ఉపన్యసించారు. అదే విధంగా యూఎస్ఏలోని చికాగోకు చెందిన లూథరన్ వరల్డ్ ఫెడరేషన్ యూత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ సవన్నా యూత్ కన్వెన్షన్‌కు హాజరైన యువతీ, యువకులతో వర్చువల్‌గా చర్చాగోష్టిలో పాల్గొన్నారు. సేవ్ నేచర్‌లో భాగంగా ప్రకృతి ప్రాధాన్యత-పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. పోలాండ్‌లో జరిగిన ఏఈఎల్‌సీ క్లైమెట్ జస్టిస్‌పై జరిగిన సదస్సులో పాల్గొన్న నలుగురు యువతీ, యువకులతో చర్చించారు. యువతను దేవుని వైపు నడిపించడంలో ఏఈఎల్‌సీ చేస్తున్న కృషిని తెలుసుకుని, ఎల్‌డబ్ల్యూఫ్, ఏఈఎల్‌సీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. చెన్నైకు చెందిన యూఈఎల్‌సీఐ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ జాషువా పీటర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో క్రైస్తవ యువతీ, యువకుల పాత్ర, భవిష్యత్ తరంలో ఏఈఎల్‌సీ పాత్రను వివరించారు. యూత్ కన్వెన్షన్-2024 కన్వీనర్ కె.రవితేజ మాట్లాడుతూ యువత దేవుని వైపు నడవడంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను కూలంకషంగా చర్చించారు. సినడ్ స్థాయిలో యువత చేయాల్సిన కార్యక్రమాలతో పాటు యువత దేవుని వైపు నడవాల్సిన ఆవశ్యకతపై దిశా నిర్దేశం చేశారు. సదస్సు ఆద్యంతం దేవుని సువార్తను యువతకు ప్రకటించడంలో తీసుకోవాల్సిన చర్యలతో పాటు తదుపరి కార్యాచరణను ప్రకటించారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ప్రథమ మహిళ ఆశా కిరణ్ పరదేశి బాబు, కార్యదర్శి చెన్నం కిషోర్ పాల్గొన్నారు.